www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 12 సెప్టెంబర్ 2025
5
అన్నమయ్య



## నూతన కలెక్టర్‌గా నిశాంత్ కుమార్



నూతన కలెక్టర్ నిశాంత్‌కుమార్



బదిలీ అయిన కలెక్టర్ శ్రీధర్

**ప్రజాశక్తి-రాయచోటి:** అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్‌గా నిశాంత్ కుమార్ గురువారం నియమితులయ్యారు. ప్రస్తుత కలెక్టర్ చామకూరి శ్రీధర్ గత ఏడాది జులైలో ఇక్కడకు వచ్చారు. ఏడాదిలోనే ఆయన బదిలీ అయ్యారు. నిశాంత్ కుమార్ గతంలో ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్‌గా పనిచేశారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా చామకూరి శ్రీధర్ జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేశారు. భూ కబ్జాలను అరికట్టడంలో ఆయన చూపిన కట్టుదిట్టమైన చర్యలతో జిల్లా ప్రజల నుండి ప్రశంసలు పొందారు. ఆయనను ఎక్కడికి బదిలీ చేశారో ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది. నూతన కలెక్టర్ నిశాంత్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపడుతున్నట్లు సమాచారం.

# ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందిస్తాం

- క్రిటికల్ కేర్ యూనిట్‌కు భూమిపూజ
- రూ.23.75 కోట్లతో యూనిట్ నిర్మాణం
- డిసెంబరులోపు 14 క్రిటికల్ కేర్‌లు పూర్తి
- మంత్రులు సత్యకుమార్, రాంప్రసాద్‌రెడ్డి



భూమిపూజ చేస్తున్న మంత్రులు సత్యకుమార్, రాంప్రసాద్‌రెడ్డి

**ప్రజాశక్తి - రాయచోటి**

జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందిస్తామని ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి సత్య కుమార్, రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రూ.23.75 కోట్లతో 50 బెడ్లతో అత్యాధునిక క్రిటికల్ కేర్ బ్లాక్ విభాగం ఏర్పాటు చేసేందుకు మంత్రులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా శ్రీ వీరభద్రస్వామి ఆలయ అర్చకులు మంత్రులకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ సుమారు రూ.24 కోట్లతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్‌ను వచ్చే సంవత్సరంలోపు పూర్తి చేసే పేదలకు ఆధునిక వైద్యం అందిస్తామన్నారు. రూ.16.65 కోట్లతో 45 వేల చదరపు అడుగులలో మూడు అంతస్తుల భవనం నిర్మిస్తామని చెప్పారు. రూ.7.15 కోట్లతో పరికరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ క్రిటికల్‌కేర్ యూనిట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. క్యాన్సర్‌పై దృష్టి సారించి ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. రాయచోటిలో భూమి పూజ చేసిన క్రిటికల్ కేర్‌ను 10 నెలల్లో పూర్తి చేసి పేదలకు నాణ్యమైన వైద్య అందిస్తామని తెలిపారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి 50 పడకల నుంచి 100 పడకలు అయ్యేందుకు సుమారు 35 సంవత్సరాలు పట్టిందన్నారు. ప్రస్తుతం 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అన్నమయ్య జిల్లా ఏర్పడిన తర్వాత పట్టణం రోజు రోజుకూ అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఈ క్రిటికల్ కేర్ యూనిట్‌కు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ భూమిపూజ చేయడం శుభ పరిణామన్నారు. క్రిటికల్ కేర్ యూనిట్‌ను సంవత్సరం లోపు పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డెవిడ్ సుకుమార్, సీనియర్ సివిల్ సర్జన్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, డాక్టర్లు కోటేశ్వరి, వెంకట శివ, అనిల్ కుమార్, రాయచోటి నియోజక వర్గ టిడిపి యువ నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్ వలి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఆసుపత్రిని తనిఖీ చేసిన మంత్రులు :** రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రులు ఎన్‌టిఆర్ వైద్య సేవలపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వార్డులలో తనిఖీ చేస్తూ రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలని డాక్టర్లకు సూచించారు. రోగులకు వైద్య సేవలు అందించడంలో ఎవ్వరు నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. రెండు 108 వాహనాలను మంత్రులు ప్రారంభించారు. 108 వాహనంలో అన్ని పరికాలు ఉన్నాయా లేవా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా పలువురు ఆరోగ్య మంత్రికి వినతి పత్రాలు సమర్పించారు.

# యూరియా కోసం రైతుల పాట్లు



యూరియా కోసం గుమికూడిన రైతులు

**ప్రజాశక్తి మదనపల్లె అర్బన్**

రాష్ట్రంలో రైతులకు యూరియా కొరత లేదని చెబుతున్న నాయకులు, అధికారుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. ఇందుకు ఉదాహరణే గురువారం మదనపల్లెలో యూరియా కోసం రైతులు ఎగబడిన తీరు. ప్రభుత్వ వ్యవసాయ కార్యాలయంలో యూరియా దొరకకపోవడంతో కొద్దిరోజులుగా దుకాణాల చుట్టూ, అగ్రికల్చరల్ కార్యాలయాల చుట్టూ రైతులు కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. ఈ క్రమంలో గురువారం స్థానిక బెంగళూరు రోడ్‌లోని సూర్యకుమార్ ఫర్టిలైజర్స్ షాప్‌కు యూరియా స్టాక్ రావడంతో రైతులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. షాపు నిర్వాహకులు హరినాథ్‌రెడ్డి, దినేష్‌రెడ్డి మరి కొంతమంది యూరియాను బ్లాక్ మార్కెట్ తరలించేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. అధికారుల పర్యవేక్షణ కొరవడం, యూరియా మూటలను విక్రయించే స్లిప్పులను నేరుగా షాపు నిర్వాహకులే ఇవ్వడంతో రైతులకు మొండిచేయి ఎదురైంది. సూర్య ఫెర్టిలైజర్స్‌కి 16 టన్నులు యూరియా అనగా 355 బస్తాలు వచ్చింది. వీటిని రైతులకు విక్రయించేందుకు అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.. రైతులు ఆధార్ కార్డులు, పాస్ బుక్ చేతపట్టుకొని స్లిప్పుల కోసం పాకులాడాల్సిన దుస్థితి నెలకొంది. షాపు నిర్వాహకుడు హరనాథ్‌రెడ్డికి చెందిన మరో వ్యక్తి దినేష్‌రెడ్డి స్లిప్పులను తన వద్దే పెట్టుకొన్నాడు. సమస్య పెద్దదిగా మారుతుండడంతో వంద మంది రైతులకు నామమాత్రంగా పంచిపెట్టాడు. అనంతరం ఇక లేవని చేతులు దులుపుకున్నారు. ఈ సమయంలో సమాచారం అందుకున్న సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు, నరసింహ సంఘటనా స్థలానికి చేరుకొని రైతుల కష్టాలను విన్నారు. ఈ సమయంలో దినేష్‌రెడ్డి వచ్చి నువ్వు ఎవరు..? ఇక్కడ రావడానికి నీకేం సంబంధం అంటూ వాగ్వాదానికి దిగాడు. ఈ సమయంలో రైతులు, స్థానికులు కలుగజేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. ఈ నేపథ్యంలో రైతులు గుంపులుగా గుమి కూడడంతో విషయం చేయి దాటితోందని గ్రహించిన దినేష్ రెడ్డి నేరుగా తహశీల్దారు కార్యాలయానికి వెళ్లి తన వద్ద ఉన్న మరికొన్ని స్లిప్పులను రైతులకు పంచిపెట్టాడు. తాము సక్రమంగానే పంపిణీ చేస్తున్నామని నమ్మించే ప్రయత్నం చేశాడు. ఈ విషయమై ఎఒ నవీన్ కుమార్ ప్రశ్నించగా స్లిప్పులు తమ కార్యాలయం సిబ్బంది ఇస్తున్నారని చెప్పుకొచ్చిన అతను విచారించుకుని, షాపు నిర్వాహకులే ఇస్తున్నారని తెలుసుకుని పరుగున సంఘటన స్థలానికి వెళ్లారు. పంపిణీ జరిగిన వరకు స్లిప్పులను ఆపేసి, ఇప్పటి నుంచి వ్యవసాయ కార్యాలయం నుంచే సరఫరా చేస్తామని చెప్పారు. దీనిపై తాహశీల్దార్ కిషోర్ కుమార్ రెడ్డి ప్రతిస్పందిస్తూ ఎవరైనా సరే యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

**- అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి**



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీలక్ష్మి

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి అన్నారు. స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో రాజంపేట ప్రాజెక్ట్ రెండవ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలను మూడో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని పేర్కొన్నారు. ఆయాలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. గుజరాత్ హైకోర్టు వర్కర్‌కు రూ.24,800, ఆయాకు రూ.20,300, ఇవ్వాలని తీర్పు ఇచ్చిందన్నారు. దీన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయాలని కోరారు. గత వైసిపి ప్రభుత్వంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంగన్వాడీ ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారని చెప్పారు. ప్రభుత్వం వచ్చి 14 నెలలైనా వేతనాలు పెంచలేదన్నారు. 42 రోజుల సమ్మె సందర్భంగా వేతనాలు జూన్‌లో పెంచుతామని, రాతపూర్వకంగా గత ప్రభుత్వం అగ్రిమెంట్ చేసిందని తెలిపారు. కార్మిక చట్టాల ప్రకారం అమలు చేయాలన్నారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చాలని, ఖాళీగా ఉన్న ఐదు వేల ఆయా పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు వర్తింపచేయాలని కోరారు. సిఐటియు ఆధ్వర్యంలో సంఘాలను బలపరుచుకొని భవిష్యత్తులో తమ హక్కుల కోసం పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. మహాసభకు ప్రాజెక్టు అధ్యక్షులు ఎం.విజయమ్మ అధ్యక్షత వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్ చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి ఎం.ఈశ్వరమ్మ, నాయకులు అమరావతి, శివరంజని, శివ జ్యోత్స్న, సుస్మిత, ఇందిరమ్మ, అనురాధ, విజయలక్ష్మి, ఉమాదేవి, నాగరత్న, మమత, తులసి, అరుణమ్మ, లక్ష్మీదేవి, సుజాత, ప్రతిమ, వనిత, స్వర్ణ, వరలక్ష్మి, నాగరాణి పాల్గొన్నారు.

# కళా ఉత్సవ్-25 పోటీలు ప్రారంభం





సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ సుబ్రమణ్యం

**ప్రజాశక్తి - రాయచోటి**

విద్యార్థుల్లోని కళాత్మక ప్రతిభను వెలికి తీసేందుకు ఉద్దేశించిన కళా ఉత్సవ్-2025 జిల్లా స్థాయి పోటీలు గురువారం పట్టణంలోని డైట్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జిల్లా విద్యాశాఖాధికారి సుబ్ర మణ్యం ప్రారంభించారు. విద్యార్థులలో సృజనాత్మకత, కళాత్మక నైపుణ్యాలను పెంపొందించడం, కళల ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించేందుకు విద్యార్థులకు వేదికను అందించడం, ప్రాంతీయ స్థాయిలో కళలను ప్రోత్సహించడం వంటి లక్ష్యాలతో కళా ఉత్సవ్-2025 జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. గాత్ర, వాద్య సంగీతం, నృత్యం, నాటకం, దృశ్యకళలు, కథాకథనం పోటీల్లో 47 పాఠశాలల నుంచి 146 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆద్యంతం ఉత్సాహంగా సాగిన ఈ పోటీల్లో విద్యార్థులు ప్రతి విభాగంలో పోటాపోటీగా తమ ప్రతిభను ప్రదర్శించారు. కళాఉత్సవ్‌లో విద్యార్థులకు కళా నైపుణ్యాలకు సంబంధించి ఆరు విభాగాలలో 12 అంశాలలో రెండు రోజులపాటు పోటీలు నిర్వహిస్తున్నామని ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన వారిని జిల్లాస్థాయి కళా ఉత్సవ్ విజేతలుగా ప్రకటిస్తామని కళా ఉత్సవ్ జిల్లా నోడల్ అధికారి మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతగా కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం గ్రహీత డాక్టర్ వేంపల్లి గంగాధర్ వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, డిసిఇబి సెక్రెటరీ నాగమునిరెడ్డి, కళాకారులు స్వతంత్ర బాబు, డైట్ అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు, ఉమ్మడి వైయస్సార్ కడప జిల్లాలోని వివిధ పాఠశాలల గైడ్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మేదరుల సమస్యలు పరిష్కరించండి

**ప్రజాశక్తి రాయచోటి**

మేదరి కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించి మేదరుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని కోరుతూ గురువారం ఆరోగం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి సత్య కుమార్ రాయచోటికి వచ్చిన సందర్భంగా రాయలసీమ మహేంద్ర (మేదరి)సంఘం ఆధ్వర్యంలో మేదరి కుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానంగా ఇతర రాష్ట్రాలలో ఉన్న విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా మేదరి కులాన్ని ఎస్‌టి జాబితాలో చేర్చి మేదరి కులానికి న్యాయం చేయాలని కోరారు. మేదరి వృత్తి దారులు తమ వృత్తి ఎక్కువ చేయడం వలన 50 సంవత్సరాలకే నడుం వంగి పోవడం, కీళ్ల జబ్బులు, ఇతర జబ్బులకు గురవుతున్నారని తెలిపారు. మేదరులకు 50 సంవత్సరాలకే పెన్షన్ మంజూరు చేయాలని పేర్కొన్నారు. వెదురుపైన ఆధారపడి జీవనం సాగించే మేదరి వారికి అటవీ ప్రాంతంలో ఉండే వెదురుపైన పూర్తి స్థాయిలో హక్కులు కేటాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భూమి లేని మేదరి కులం వారికీ వెదురు పెంపకం కోసం భూమి కేటాయింపు చేయాలని కోరారు. వెదురు కోతకి వచ్చిన తర్వాత దాదాపు 40 సంవత్సరాల వరకు జీవనోపాధి ఉంటుందని వినతిపత్రంలో వివరించారు. కార్యక్రమంలో రాయలసీమ మహేంద్ర (మేదరి) సంఘం గౌరవ అధ్యక్షులు గుజపనేని వెంకట సుబ్బయ్య, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు టంగుటూరు నాగార్జున, ఉపాధ్యక్షులు ఆర్ల నరసింహులు, ప్రధాన కార్యదర్శి గుజపనేని వెంకట జయ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## 15 నుంచి పాఠశాల క్రీడా పోటీలు

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

ఈ నెల 15 నుంచి పాఠశాలల క్రీడా పోటీలు ప్రారంభం అవుతున్నట్లు మండల స్కూల్ గేమ్స్ కో-ఆర్డినేటర్ శివశంకర్ తెలిపారు. సిటిఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 15వ తేదీన వాలీబాల్, కబడ్డీ, చెస్, 16న మదనపల్లి జడ్పీ హైస్కూల్‌లో యోగా, ఖోఖో, బ్యాడ్మింటన్, 17న మదనపల్లి జడ్పీ హైస్కూల్‌లో అండర్-14, అండర్-17 బాలబాలికలకు అథ్లెటిక్ పోటీలు నిర్వహిస్తామన్నారు. మదనపల్లెలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు, మున్సిపల్, మోడల్, గురుకుల, మేనేజ్‌మెంట్ల పాఠశాల విద్యార్థులు పాల్గొన వచ్చని తెలిపారు. గెలుపొందిన వారు డివిజన్ స్థాయిలో జరిగే స్కూల్ గేమ్స్ పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. వీరి వెంట ప్రధానోపాధ్యాయుల ద్వారా ధృవీకరించిన మిడ్ డే మిల్ పత్రం, ఈవెంట్ ఎంట్రీ ఫారం, తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు.

## ఎంపిడిఒగా పరిపూర్ణ అరుంధతి

**ప్రజాశక్తి - రాయచోటి అర్బన్**

రాయచోటి రూరల్ మండల అభివృద్ధి అధికారిగా బి.పరిపూర్ణ అరుంధతి గురువారం బాధ్యతలు చేపట్టారు. కడప జిల్లా ముద్దనూరు మండలం ఎంపిడిఒ కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ అధికారినిగా పనిచేస్తున్న ఆమె సాధారణ ప్రమోషన్లలో భాగంగా రాయచోటి ఎంపిడిఒగా బదిలీపై వచ్చారు. ఇన్‌ఛార్జిగా ఎంపిడిఒగా కొనసాగుతున్న సురేష్‌నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన ఎంపిడిఒ మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. కార్యాలయం సిబ్బంది ఆమెకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

## కొనసాగుతున్న క్రికెట్ మ్యాచ్‌లు

**- భారీ స్కోరు దిశగా నెల్లూరు జట్టు**

**ప్రజాశక్తి - కడప**

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) సౌత్ జోన్ అండర్-23 మల్టీ డే క్రికెట్ టోర్నీలో భాగంగా గురువారం వై.ఎస్.రాజారెడ్డి ఎసిఎస్టేడియంలో నెల్లూరు, చిత్తూరు జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 75.0 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 407 పరుగుల భారీ స్కోరు దిశగా సాగుతోంది. ఆ జట్టులోని రోషన్ పవన్ కుమార్ బ్యాటింగ్ అద్భుతంగా ప్రదర్శించి 226 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. సుతేజ్‌రెడ్డి 89 (నాటౌట్) పరుగులు చేశారు.

కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో ప్రారంభమైన వేరొక మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్‌లో 57.0 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. ఆ జట్టులోని నయీముల్లా 107 (సెంచరీ) పరుగులు చేశాడు. సాయి గణేష్ 57 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అనంతపురం జట్టులోని షేక్ కామిల్ రెండు వికెట్లు తీసుకున్నాడు.



తలపడుతున్న నెల్లూరు-చిత్తూరు జట్లు

## స్టాఫ్‌నర్స్ ప్రమోషన్ల కోలాహలం

**60 స్టాఫ్‌నర్సు పోస్టులకు 50 భర్తీ - గైర్హాజరీల పరిస్థితిపై గందరగోళం?**



స్టాఫ్‌నర్సుల మెరిట్ లిస్టులను పరిశీలిస్తున్న అధికారులు

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

జిల్లాలో స్టాఫ్‌నర్స్ పోస్టుల కోలాహలం నెలకొంది. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని జోన్-4 కేటగిరీ పరిధిలో 397 పిహెచ్‌సిలు ఉన్నాయి. వీటిలో తరుచుగా స్టాఫ్‌నర్స్ పోస్టులకు ఖాళీలు ఏర్పడు తున్న సంగతి తెలిసిందే. ఆర్డీ కార్యాలయం ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఆదేశాల మేరకు రిక్రూట్‌మెంట్ చేస్తోంది. స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. 12 వేల మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. సీనియారిటీ ఆధారంగా గురువారం జిల్లా రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో 68 స్టాఫ్‌నర్స్ పోస్టుల రిక్రూట్‌మెంట్‌కు అభ్యర్థులను ఆహ్వానించారు. 50 మంది రిక్రూట్‌మెంట్‌కు హాజరయ్యారు. ఆర్‌డి కార్యాలయ యంత్రాంగం అర్హత కలిగిన అభ్యర్థులకు స్టాఫ్‌నర్స్‌లుగా పోస్టింగ్స్ ఇచ్చింది. స్టాఫ్‌నర్స్ రిక్రూట్‌మెంట్‌కు గైర్హాజరైన 18 మంది భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్ రిక్రూట్‌మెంట్‌లో 68 మంది జాబితా ఎగువన ఉన్న వారిని మాత్రమే పిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రిక్రూట్‌మెంట్ సమయంలో వివిధ అనివార్య కారణాల వల్ల గైర్హాజరైన 18 మందికి మరోసారి అవకాశం లభించని పరిస్థితి ఏర్పడింది. దీనిపై రీజినల్ డైరెక్టర్ రామగిడ్డయ్యను సంప్రదించగా రిక్రూట్‌మెంట్ నిబంధనల ప్రకారం గైహాజరైన అభ్యర్థులను మరో సారి పిలవడానికి అవకాశం లేదని తెలిపారు. అటువంటి వారిలో అత్యధికులు పలు పిహెచ్‌సిల్లో విధులు నిర్వహించేవారే ఎక్కువగా ఉన్నారని పేర్కొనడం గమనార్హం.

## విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

**- మంత్రి సత్యకుమార్‌కు నాయకుల వినతి**

**ప్రజాశక్తి-రాయచోటి అర్బన్**

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నేతలు విన్నవించారు. గురువారం రాయచోటిలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి సత్యకుమార్‌ను కలిసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని కోరారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు. 2022 పిఆర్‌సి ప్రకారం రావాల్సిన అరియర్స్ ఇవ్వాలని, సర్వీస్ ఇంక్రిమెంట్‌ను ఇవ్వాలని మంత్రిని కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని విన్నతించారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ న్యాయం చేస్తామని, అసెంబ్లీలోనూ చర్చిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యుఇసిడబ్ల్యు డిస్కం అధ్యక్షులు సుబ్రమణ్యంరాజు, రాయచోటి డివిజన్ అధ్యక్షులు నాగేష్ గౌడ్, కమిటీ సభ్యులు రామాంజనేయరెడ్డి, రామాంజనేయులు, విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డుల అభివృద్ధికి కృషి

**మార్కెట్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారంలో మంత్రులు సత్యకుమార్, రాంప్రసాద్‌రెడ్డి**



మంత్రులను సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ సభ్యులు

**ప్రజాశక్తి - రాయచోటి/రాయచోటి అర్బన్**

మార్కెట్ యార్డులో అభివృద్ధికి కృషి చేస్తామని ఆరోగం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి సత్య కుమార్, రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మార్కెట్ యార్డు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన రాయచోటి మార్కెట్ యార్డు చైర్మన్‌గా అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా శ్రీనివాసులు నాయుడు, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డు చైర్మన్‌గా షఫి నాయక్, వైస్ చైర్మన్‌గా మల్లికార్జున, కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ ఫలాలు చూసి జగన్‌మోహన్‌రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ఐదేళ్లల్లో అభివృద్ధి చేసి ఉంటే రాష్ట్ర ప్రజలు ఎందుకు ఓడించారని ప్రశ్నించారు. జగన్ హయాంలో రూ.10 లక్షల కోట్లు ప్రభుత్వం అప్పుల ఊబిలో ఉందని గుర్తు చేశారు. జగన్ ఒక్క సారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. రాయచోటి, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డులను అభివృద్ధి చేస్తానని తెలిపారు. రైతన్నలకు బాసటగా మార్కెట్ యార్డు కమిటీ సభ్యులు నిలవాలన్నారు. యూరియాపై తప్పుడు ప్రచారాలు మాను కోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం యూరియాను 90 శాతం సబ్సిడీతో కొరత లేకుండా అందిస్తున్నదని గుర్తు చేశారు. ఈ సబ్సిడీ వల్ల కేంద్ర ప్రభుత్వానికి సుమారు రూ.1.50 లక్షల కోట్లు భారం పడుతుందని తెలిపారు. మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 14 నెలల్లో ఎన్నో అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందించినట్లు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అంటే ఒక నమ్మకమన్నారు. 14 నెలల్లో రాయచోటి నియోజకవర్గంలోనే 400 బోర్లు వేసి నీటి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం 5 సంవత్సరాలలో నీటి సౌకర్యం కల్పించి ఉంటే హంద్రీనీవా కాలువలో చెట్లు ఏ విధంగా ఉంటాయని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 14 నెలల్లోనే సుమారు రూ.400 కోట్లతో టెండర పిలిచేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసు కుంటున్నారన్నారు. శ్రీనివాసపురం రిజర్వాయర్ కింద 25 వేల ఎకరాలకు సంబేపల్లి, చిన్నమండెం మండలాలకు సంవత్సరంలోపే నీళ్లు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జలజీవన్ మిషన్ పథకం ఫస్ట్ పేజ్‌లో రాయచోటి నియోజక వర్గంలోని 6 మండలాలలో 840 పల్లెలకు రూ.400 కోట్లతో నీరు అందిస్తు న్నామని తెలిపారు. కార్యక్రమాన్ని గాలివీడులో 30 వేల మందితో భారీ బహి రంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రూ.11 కోట్లతో 29 రోడ్లకు గుంతలు పూడ్చి వేసినట్లు గుర్తు చేశారు. రాయచోటి-వేంపల్లి రోడ్డు పూర్తి చేశామన్నారు. అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీ పడలేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి ఎవరైతే నిజా యితీగా రైతులు ఉన్నారో వారందరికి తిరిగి భూములు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కడప నుంచి పీలేరు వరకు 4 లైన్ల రహదారులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గువ్వల చెరువు ఘాట్‌లో కేంద్ర ప్రభుత్వం సహకారంతో సొరంగ మార్గం ఏర్పాటు చేయడానికి టెండర్లు పిలిచేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. రాయచోటి నియోజక వర్గంలో 70 కోట్లతో సిమెంట్ రోడ్లు వేసినట్లు గుర్తుచేశారు. రాయ చోటి మార్కెట్ యార్డు చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన అనుంపల్లి రాంప్ర సాద్‌రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాసుల నాయుడు, లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మైనార్టీ నాయకుడు షఫీ నాయక్, వైస్ చైర్మన్ మల్లికార్జున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, జిల్లా బిజెపి అధ్యక్షులు సాయి లోకేష్, పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి, పాల ఏకిరుల సంఘం రాష్ట్ర డైరెక్టర్ నాగేశ్వర నాయుడు, నియోజకవర్గ టిడిపి నాయకుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్‌వలి, డాక్టర్ పాలగిరి శ్రీనివాసరాజు, టిడిపి నాయకుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సుండుపల్లి : మురుగు ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

**ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి**

మన చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దూరంగా ఉంటాయని మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరామయ్య పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లి లోని దేవలంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లక్కిరెడ్డిపల్లి కమ్యూనిటీ ఆస్పత్రిని ఆయన పరిశీలించారు. జ్వర పీడితులు ఎక్కువగా ఉన్నారని వీరికి రక్త పరీక్షలు చేయించి తగు చికిత్స నిర్వహించాలని తెలిపారు. సర్పంచ్ అహల్య, పంచాయతీ సెక్రెటరీ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన లక్కిరెడ్డిపల్లి మురుగు కుంటల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ దేవదాసు, ఆరోగ్య కార్యకర్తలు రాజేంద్రప్రసాద్, జేబీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **సుండుపల్లి :** మండల కేంద్రం సుండుపల్లిలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. సీజనల్ వ్యాధులు ప్రబలు తుండటంతో రోడ్లు, డ్రైనేజీ కాలువలు, గుంతల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో చెత్తా చెదారం, వ్యర్థాలను తొలగించివేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది ఓబులేసు మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దోమలు విజృంభిస్తున్నాయని ప్రజలు విష జ్వరాల బారి పడుతున్నారని పేర్కొన్నారు. చాలా గృహాల్లో జ్వర పీడి తులు ఉన్నారని చెప్పారు. విష జ్వరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలి పారు. దోమల వృద్ధి చెందకుండా గృహాల్లో టెంకాయ చిప్పలు, టైర్లు, వాటర్ కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. కిటికీలకు మెష్ కొలిపించుకోవాలని, వేప ఆకుతో పొగ వేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దోమ తెరలను వాడాలన్నారు. మండలం కేంద్రంలోని ప్రధాన వీధుల్లో బ్లీచింగ్ చల్లించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## మహిళా చట్టాలపై అవగాహన

**ప్రజాశక్తి-చిన్నమండెం**

మండల పరిధిలోని జడ్‌పి పాఠశాలలో గురువారం కిశోరబాలికల కు మహిళా చట్టాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి సూపర్వైజర్లు పవనకుమారి, లక్ష్మమ్మ, మల్లూరు హై స్కూల్ హెడ్ మాస్టర్ రెడ్డప్ప పాల్గొన్నారు. కిశోర బాలికలు నెలసరి వచ్చే సమస్యల పట్ల ఆరోగ్య హీనత సమస్య రాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని పేర్కొన్నారు. కిశోరబాలికల రక్షణ కోసం పోక్సో చట్టాల గురించి వివరించారు. ఆడపిల్లల పట్ల మైనర్ బాలికల పట్ల అసభ్య కరంగా ప్రవర్తించిన కఠినమైన చట్టాలు ఉన్నాయని కిశోర బాలికలు తెలుసుకోవాలన్నారు. గ్రామాలలో నేటికి బాల్య వివాహాలు జరుగుతు న్నాయని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. చిన్న వయసులో పెళ్లి చేసుకోవడం వల్ల వచ్చే అనర్థాల గూర్చి వివరించారు. ఆడపిల్లల్లో స్కిల్స్ గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి కావాల్సిన ఉపాధి అవకాశాలు కల్పిస్తు న్నాయన్నారు. సమావేశంలో అంగన్వాడీ కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు.

## బకాయిలు వెంటనే చెల్లించాలి

**ప్రజాశక్తి-కలికిరి**

పెండింగ్‌లో ఉన్న డిఎ, మెడికల్ బిల్లులు, సరెండర్ లీవ్ బకాయిలు వేలకోట్ల రూపాయలు పేరుకుపోయాయని వాటిని వెంటనే విడుదల చేయాలని ఎపిటిఎఫ్‌జిల్లా అధ్యక్షులు కుమార్‌యాదవ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం గతంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీమేరకు ఒకటిన్నర సంవత్సరం కావస్తున్నా బకాయిలు అరకొర మాత్రమే చెల్లించిదని, ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారని ఇంకా ఆలస్యం చేయడం సబబేనా అని ప్రశ్నించారు.ఎపిజిఎల్ఐ, పిఎఫ్ లోన్లు వెంటనే మంజూరు చేయాలన్నారు.

## రైలు నిలుపుదలపై హర్షం

**ప్రజాశక్తి-నందలూరు**

పూణే నుండి కన్యాకుమారి వెళ్ళు జయంతి జనత ఎక్స్‌ప్రెస్ రైలు నందలూరు రైల్వే స్టేషన్‌లో నిలుపుదల చేయడంపై ఏనుగుల బాలాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం నందలూరు రైల్వే స్టేషన్‌కి చేరుకొని రైలు లోకో పైలెట్, సహాయ లోకో పైలెట్, గార్డ్‌లను శాలువాతో సన్మానించి స్వీట్లు అందించి ఆనందాన్ని పంచుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ 19 నుంచి నందలూరు రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లకు నిలుపుదలను తీసివేశారు. ఐదు సంవత్సరాల అనంతరం పూణే కన్యాకుమారి జయంతి రైలును నిలుపుదల చేయడం వలన నందలూరు వాసులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తోట శివశంకర్, రాచూరి మురళీధర్,ముమ్మడిశెట్టి సుధాకర్, మోహన్, పరం దామా, నాగభూషణం, సురేష్, రమేష్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు బాధ్యతగా మెలగాలి

**ప్రజాశక్తి-నందలూరు**

మండలంలోని ఆడపురు గ్రామంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని ఉపాధ్యాయులు, సిబ్బంది బాధ్యతగా మెలగాలని ఆ పాఠశాల చైర్మన్ ఇరువురి మురళి పేర్కొన్నారు. గురువారం ఆయన పాఠశాలలోని ప్రాంతాలను, పిల్లలకు తయారు చేస్తున్న ఆహార పదార్థాలను అక్కడ ఉన్న కూరగాయలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు పేద విద్యార్థులకు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇస్తున్న నాణ్యమైన విద్య, వసతులు కల్పనను స్కూల్ అధికారులు, సిబ్బంది ఎక్కడ భంగం కలిగే విధంగా ప్రయత్నించకూడదన్నారు.

## పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

**ప్రజాశక్తి- రైల్వేకోడూరు**



రైతులకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

ఆత్మ ఆధ్వర్యంలో రైతు లను అనంతరాజుపేట హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్, హార్టికల్చర్ కాలేజ్‌లో పుట్టగొడుగుల యూనిట్ నర్సరీలను, పాలీహౌస్‌లో మొక్కల పెంపకం పద్ధతుపై రైతులకు శిక్షణ నిర్వహించారు. సేంద్రీయ పద్ధతులైన ఎరువుల వాడకం జీవన ఎరువుల ఉపయోగం బొప్పాయి పంటలో శాస్త్రవేత్తలు డాక్టర్ సందీప్‌నాయక్, డాక్టర్ యోహాన్ తెలిపారు. పుట్టగొడుగులు కల్టివేషన్ ఏ విధంగా రైతులు తమ ఇంటి వద్ద తయారు చేసుకోవచ్చు వాటి నుంచి అదనపు ఆదాయం పొందే శాస్త్రీయ పద్ధతులను డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ ఈరేష్ కుమార్ అసిస్టెంట్ ప్రొఫెసర్ తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ టెక్నాలజీ మేనేజర్, రైల్వే కోడూరు బాలసుబ్రమణ్యం, బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ రాజంపేట ఓబిఎస్ కుమార్, మండల వ్యవసాయ అధికారి పి.సందీప్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సుధీర్ వర్మ, రైల్వే కోడూరు డివిజన్‌రాజంపేట డివిజన్ రైతులు పాల్గొన్నారు.



# కోళ్ల ఫారంలో పారిశుధ్య పనులు చేపట్టండి

### నిర్వాహకులకు నోటీసు జారీ చేసిన అధికారులు

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

కోళ్ల ఫారాలలో పారిశుధ్య పనులు చేపట్టాలని నిర్వాహకులకు మండల అధికారులు సూచించారు. రెడ్డివారిపల్లి గ్రామంలోని కోళ్ల ఫారంను తహశీల్దార్ తపస్వని, ఎంపిడిఒ రమేష్ బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు, పంచాయతీ కార్యదర్శులతో కలసి తనిఖీ చేశారు. రెడ్డివారిపల్లి గ్రామంలోని వడ్డిపల్లి గ్రామస్తులు కోళ్ల ఫారం వ్యర్థాలతో దోమలు, ఈగలు ప్రబలుతు న్నాయని సంబంధించిన కోళ్ల ఫారంపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో గురువారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిట్టావాండ్లపల్లిలోని వడ్డీపల్లి సమీపంలో గోపాల్‌రెడ్డి అనే వ్యక్తి కొన్ని ఏళ్ల క్రితం కోళ్ల ఫారం ఏర్పాటు చేసి కోడి గుడ్లను ఉత్పత్తి చేస్తున్నారని తెలిపారు. కొన్ని సంవత్సరాల క్రితం తన కోళ్ల ఫారాన్ని పౌల్ట్రీ రంగానికి సంబంధించిన ఓ ప్రైవేటు సంస్థకు లీజుకు ఇవ్వడం జరిగిందన్నారు. వారు ఈ కోళ్ల ఫారంలో కోడి గుడ్లను ఉత్పత్తి చేస్తూ, మార్కెట్లోకి ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కోళ్ల ఫారం గ్రామానికి అతి దగ్గరగా ఉందని, గత కొన్ని రోజులుగా కోళ్ల ఫారంలో తగిన సిబ్బంది లేనందున సకాలంలో పారిశుధ్య పనులు చేపట్టలేదన్నారు. కోళ్ల ఫారం లోని వ్యర్థాలతో దోమలు, ఈగలు ప్రబలుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలు, పాఠశాలలోని విద్యార్థులు భోజనం చేయాలంటే భయపడుతున్నారన్నారు. వీటిపైఫిర్యాదు అందడంతో కోళ్ల ఫారాన్ని తనిఖీ చేయడం జరిగిందన్నారు. కోళ్ల ఫారం నిర్వాహకులకు వెంటనే కోళ్ల ఫారం లోనూ, చుట్టుపక్కల ఉన్న ఏనుగొండవారిపల్లె, వడ్డీపల్లె, పిట్టావాండ్లపల్లెలోను ఈగలు సమస్య పరిష్కారానికి మూడు రోజులలో పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టాలని నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అధికారుల ఆదేశాలకు అనుగుణంగా కోళ్ల ఫారం నిర్వహణ చేపట్టాలని, క్రమం తప్పకుండా పారిశుధ్య పనులను నిర్వహించాలని సూచించారు. మండలంలోని కోళ్ల ఫారం నిర్వాహకులు వెంటనే కోళ్ల ఫారాల్లో పారిశుధ్యం పనులు చేపట్టాలని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు వెంటనే కోళ్ల ఫారాలను సందర్శించి వాటి నిర్వహణపై సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించాలన్నారు. అధికారుల ఆదేశాలను నిర్లక్ష్యం చేస్తే కోళ్ల ఫారంకు సంబంధించిన లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ తపస్వాని, ఎంపిడిఒ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు, పంచాయతీ కార్యదర్శి గాయత్రి, విఆర్ఒ నాగరాజా పాల్గొన్నారు.



పిట్టావాండ్లపల్లెలో కోళ్ల ఫారంను తనిఖీ చేస్తున్న తహశీల్దార్, ఎంపిడిఒ

# ప్రతి రైతుకూ యూరియా అందిస్తున్నాం

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

రైతులకు అవసరమైన యూరియా అందుబాటులోనే ఉందని ప్రతి రైతుకు యూరియాను అందిస్తున్నామని మండల ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలో జరుగుతున్న యూరియా పంపిణీని తహసిల్దార్ తపస్వని, ఎఒ మంజుల, ఎంపిడిఒ రమేష్ బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని రైతులకు సరిపడ యూరియా అందుబాటులోనే ఉందని అన్నారు. ప్రతి రైతుకు యూరియాను అందిస్తున్నామని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు అధికంగా వరి పంటను సాగు చేస్తున్నారని, వరి నాటే సమయంలోనూ, కలుపు తీసే సమయంలోనూ యూరియా అవసరం ఉందన్నారు. సాధారణంగా ఎకరా పొలానికి ఒక బస్తా యూరియా వాడితే సరిపోతుందన్నారు. మోతాదుకు మించి యూరియాను పంటకు వాడితే పంట ఏపుగా పెరుగుతుందే తప్ప ఆశించిన దిగుబడి రాదన్నారు. యూరియాను కేవలం పంట ఎదుగుదలకు మాత్రమే ఉపయోగించాలని సూచించారు. ఇప్పటివరకు మండలంలో సుమారు 200 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశామన్నారు. త్వరలోనే మరో 150 మెట్రిక్ టన్నుల యూరియాను మండలానికి తెప్పించడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. రైతులు గుళికల యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియాను వాడాలని అన్నారు. ఉన్నతాధికారులు కూడా యూరియా పై నిరంతరం సమీక్షిస్తున్నట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది యూరియా పంపిణీ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో ఎఒ మంజుల, వ్యవసాయ సహాయకులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు. **రామాపురం :** రైతులకు నానో, సేంద్రియ ఎరువుల వినియోగం అలవర్చుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి నాగమణి అన్నారు. మండలంలోని శుద్ధమల్ల పంచాయతీ ఓబుల్‌రెడ్డి గారిపల్లెలో సేంద్రియ నానో ఎరువులు వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ యూరియా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రసాయన ఎరువులు అధికంగా వాడటం వల్ల సారవంతమైన భూములు భూమిలోని లవణాలను సైతం కోల్పోతు న్నాయని రైతులు సేంద్రీయ, నానో, ఎరువులను వినియోగించాలని సూచించారు. మండలంలో యూరియా కొరత లేదన్నారు.పంట పెట్టిన ప్రతి రైతుకు యూరియా కొరత లేదన్నారు. కార్యక్రమంలో డిఆర్‌సి ఎఒ ప్రభావతమ్మ, రైతు భరోసా ఇన్‌ఛార్జి రేఖ రైతులు పాల్గొన్నారు. **గాలివీడు:** పొలాలు సాగు చేస్తున్న రైతులు సేద్యములో రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను వాడడం అలవాటు చేసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ టి. వెంకటరత్నం పేర్కొన్నారు. సచివాలయం-3, బురుజు పల్లి వద్ద రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ యూరియా కొరత లేదని సమృద్ధిగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎఇఒ అలీ, రైతులు అన్నారెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



రామాపురం : రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ

# ఘనంగా ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి-నిమ్మనపల్లి**

మండలంలో రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైసిపి మండల అధ్యక్షులు కొమ్మేపల్లి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంపిపి నరసింహులు, వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి, మాజీ మండలాధ్యక్షులు ఆర్.ఐ రమణారెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఖాదర్ భాషా, రామారావు, రామ్మోహన్ రెడ్డి, రెడ్డి భాస్కర, హోటల్ రఫీ, సుధాకర, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :**స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట మాజీ కౌన్సిలర్ మధుసూధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, మున్సిపల్ ఛైర్ పర్సన్ మనూజరెడ్డి, ఎపిఎండిసి మాజీ ఛైర్ పర్సన్ షమీమ్ అస్లాం, అనీషారెడ్డి, కౌన్సిలర్లు సాయిశేఖర్ రెడ్డి, నరేంద్ర, ప్రసాద్, శారదారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూమదనపల్లెకు మెడికల్ కాలేజ్, కేంద్రీయ విద్యాలయం, మదనపల్లె టూ తిరుపతి నాలుగు వరుసల రహదారిని ఎంపీ మిథున్‌రెడ్డి తీసుకొచ్చారన్నారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో వైసిపి శ్రేణులు పాల్గొన్నారు. **14వ వార్డులో..**పట్టణం 14వ వార్డులో వైసిపి మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి కరీముల్లా, కౌన్సిలర్ షబానా ఆధ్వర్యంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఇరిగేషన్ డైరెక్టర్ రవిచంద్రారెడ్డి, రమాదేవి, సయ్యద్, శాంతి, శామీర్ పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైసిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు,మాజీ ఎంపీపీ పాగొండ ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ జ్యోతి బస్టాండ్ వద్ద జరిగిన రక్తదాన శిబిరంలో 106 మంది రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ప్రదీప్ రెడ్డి,వైసీపీ పట్టణం కన్వీనర్ సిఆర్ చిన్నికృష్ణ, ఎంపిటిసిలు రామసబ్బారెడ్డి, నాగార్జున రెడ్డి,ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ కంచి కళ్యాణ్ కుమార్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కలికిరి:** రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు కలికిరి బీడీ కాలనీలో వైసిపి నాయకులు, కార్యకర్తలు వైభవంగా నిర్వహించారు. వైసిపి కన్వీనర్ చింతల రమేష్ రెడ్డి, షేక్ హనీఫ్ కేక్ కట్ చేసి అందరితో కలిసి పంచుకున్నారు. కార్యక్రమంలో రత్నశేఖర్ రెడ్డి, మధురెడ్డి, ఎస్‌టిడి హరి, వెంకటపతి, శివాజీ, రామచంద్రారెడ్డి, మహేంద్ర రెడ్డి, జయచంద్ర, శామ్యూల్, సుభహాన్, జావీద్, మిలటరీ ఫిరోజ్, జాకీర్ పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** మండలంలో ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకులు మండలం కేంద్రంలోని వైఎస్ఆర్ కూడలిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్ద ఎత్తున బిరియాని పంచి పెట్టారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ చౌడేశ్వర, వైస్ ఎంపిపి కరీం,శ్యామలమ్మ కోటిరెడ్డి, ఆర్‌బికె ఛైర్మన్ రెడ్డి మల్‌రెడ్డి, సింగల్ విండో ఛైర్మన్ భార్గవ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి వ్యక్తిత్వం యువతకు ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఎంపీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో జడ్‌పిటిసి నిర్మల, సర్పంచ్ గంగులమ్మ, నాయకులు చింతల శివానంద రెడ్డి, నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, ఇబ్రహిం, శ్రీధర్‌రాయల్, శివారెడ్డి, ఆనంద, చంద్రశేఖర్, సైఫుల్లా పాల్గొన్నారు. **కలకడ:** ఎంపీ జన్మదిన వేడుకలను మండల పార్టీ అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి, ఎంపిపి శ్రీదేవి రవికుమార్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాసులు రెడ్డి కాంప్లెక్స్‌లో ఘనంగా నిర్వహించారు. కేకు కట్ చేసి పార్టీ శ్రేణులకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.



తంబళ్లపల్లి : ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో వైసిపి నాయకులు, కార్యకర్తలు

## సబ్సిడీతో డ్రోన్ మంజూరు

**ప్రజాశక్తి-పుల్లంపేట**

మండలంలోని టి.కమ్మపల్లి గ్రామ పంచాయతీకి చెందినటువంటి ఆంజనేయ రైతు మిత్ర సంఘానికి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఎపిజిబి సౌజన్యంతో రూ.9.80లక్షలు విలువ చేసే డోన్ స్ప్రేయర్‌ను 50శాతం రాయితీతో అందించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ జయశ్రీ మాట్లాడుతూ అవగాహన కార్యదీక్షత ఉన్న రైతులకు ఈ అవకాశం కల్పించినందుకు చాలా సంతోషమని పేర్కొన్నారు. అరటి, బొప్పాయి వివిధ రకాల పంటలకి డ్రోన్ సహాయంతో నానో యూరియా, నానో డిఎపి, వివిధ రకాల పురుగు మందులను ఉపరితలం నుంచి స్ప్రేయింగ్ చేస్తే మంచి లాభాలు ప్రయోజనాలు కలుగుతాయన్నారు. డ్రోన్ స్ప్రేయర్ ద్వారా రైతులకు సేవలు అందించాలని కోరారు. ఎఒ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఇటువంటి పథకాలను రైతులు గ్రూపులుగా ఏర్పడి ఉపయోగించుకోవాలన్నారు. అవకాశం ఉన్నప్పుడు ప్రభుత్వం అందించే సబ్సిడీ పరికరాలను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది జగ్గుబాబు, ప్రదీప్ రెడ్డి, వ్యవసాయ అధికారులు లత, పంచాయతీ సెక్రెటరీ రామ సుబ్బయ్య, స్వాతి, ఆంజనేయ రైతు మిత్ర సంగం సభ్యులు కావుటూరి నాగేశ్వరరావు, వర్దన్నగారి ఆంజనేయులు, వెంకటాద్రినాయుడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## చెత్తా చెదారం వేస్తే జరిమానా

**ప్రజాశక్తి-ములకలచెరువు**

రైల్వే పరిసర ప్రాంతాల్లో చెత్తచెదారం, మాంసపు వ్యర్థాలను వేసిన వారికి జరిమానా వేసినట్లు కదిరి రైల్వే ఎఎస్ఐ శివారెడ్డి అన్నారు. గురువారం ములకలచెరువులో రైల్వే పరిసరాల్లో చెత్తచెదారం వేయడం జరిగిందని, రైల్వేస్టేషన్ పరిసరాలతో పాటు ములకలచెరువులోని రైల్వే పరిసరాల్లో చెత్తచెదారం, కోడి వ్యర్థాలు వేసిన దుకాణదారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ క్లినింగ్నెస్ డ్రైవ్‌లో 15 మందికి రూ.3వేలు జరిమానా విధించినటు తెలిపారు. కార్యక్రమంలో గురుమూర్తి పాల్గొన్నారు.

## అందుబాటులోకి ఆధార్ సెంటర్

**ప్రజాశక్తి -చిట్వేలి**

సచివాలయాల సిబ్బందిలో ఇటీవల జరిగిన బదిలీల కారణంగా ఆధార్ ప్రక్రియ పూర్తిస్థాయిలో నిలిచిపోయింది. ప్రస్తుతం నేతివారిపల్లె సచివాలయంలో ఆధార్ కేంద్రం ప్రారంభమైనట్లు ఎంపిడిఒ కె.శ్రీనివాసులు గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సచివాలయాల్లో ఉన్న మూడు ఆధార్ సెంటర్లో తిరిగి త్వరలోనే ఆధార్ నమోదు సెంటర్లను ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. బదిలీల్లో ఇక్కడ నుంచి వెళ్ళిన డిజిటల్ అసిస్టెంట్స్ స్థానంలో ఆధార్ నమోదులో శిక్షణ పొందిన డిజిటల్ అసిస్టెంట్లు లేకపోవడం జాప్యం జరిగిందని, ఆ సమస్యను పూర్తిస్థాయిలో మొదలవుతుందన్నారు.

## ప్రభుత్వ భూములు పరిశీలన

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి**

మండలంలోని రెడ్డికోటకు సమీపంలో పర్ల గోళ్ళపల్లె వద్ద ఎపిఐఐసికి కేటాయించిన ప్రభుత్వ భూములను గురువారం సబ్ కలెక్టర్ కళ్యాణి అధికారులతో కలసి పరిశీలించారు. ఎపి ఐఐసి ఆధ్వర్యంలో పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి గతంలో రెడ్డికోటకు వద్ద 20 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారులు గుర్తించి ఉన్నతధికారులకు నివేదికలు పంపారు. కొన్నేళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే రోడ్డున పడతామని రైతులు సబ్ కలెక్టర్ ఎదుట వాపోయారు. సబ్ కలెక్టర్ వెంట ఇన్‌ఛార్జి తహశీల్దార్ ధనుంజయులు, మండల సర్వేయర్ నాగరాజు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## 15 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

**ప్రజాశక్తి-పుల్లంపేట**

మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు ఎంఇఒ చక్రధర్ రాజు, నాగా తిరుమల రావు పుల్లంపేట ఎంఆర్‌సిలో సమావేశం నిర్వహించారు. మండలం లోని అన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనే మండల స్థాయి క్రీడా పోటీలను ఈనెల 15 నుంచి కొత్తపేట జడ్‌పి హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్ పోటీలు నిర్వహిం చనున్నట్లు తెలిపారు. 16న అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. మండలం లోని జడ్‌పి ప్రయివేట్ పాఠశాలల్లో చదువుతున్న 14 నుంచి 17 సంవత్సరాల వయస్సు గల బాల, బాలికలు ఈ పోటీలలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఈ పోటీల ద్వారా జిల్లా స్థాయి పోటీలకు మండలానికి ప్రాతినిధ్యం వహించే జట్లు ఎంపిక చేస్తారని తెలిపారు. సమావేశంలో మండల స్థాయి పీడీలు చంద్ర కుమార్ సాయిరాం. కనకదుర్గ, పిఇటి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఆడపిల్లలను చదివిద్దాం

**ప్రజాశక్తి-కలికిరి**

ఆడపిల్లలను రక్షిద్దాం-ఆడపిల్లలను చదివిద్దాంఅని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మహమ్మద్ రఫీ అన్నారు. మిషన్ శక్తి సంకల్ప కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం లోని మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో డిఎంహెచ్ఒ ఆదేశాల మేరకు విద్యార్థులకు ప్రిన్సిపాల్ సోమశేఖర్ అధ్యక్షతన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లల (0-6) లింగ నిష్పత్తి మన జిల్లా లో 916 ఉందని అనగా 1000మంది బాలురకు 916 మంది బాలికలు ఉన్నారని, లింగ వివక్షత వల్లనే ఇలా జరుగుతుంది అన్నారు. గర్భస్త పిండ లింగ నిర్ధారణ చట్టం 1994 అమలులోకి వచ్చిందన్నారు. దీని ప్రకారం పుట్టబోయే బిడ్డ ఆడ లేక మగ అని తెలుసు కోవడం చట్ట రీత్య నేరమన్నారు. ఈ చట్టాన్ని ఉల్లంగించిన వారిపై చర్యలు తీసుకుంటారని చెప్పారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి, టోల్ ఫ్రీ నంబర్స్ 108,104,1098,181,112,100 మరియు తెలీమానస్ 14416నెంబర్ కు ఫోన్ చేసి మానసిక ఆరోగ్యం గురించి సలహాలు పొందవచ్చు అన్నారు. కార్యక్ర మంలో ప్రిన్సిపల్ సోమశేఖర్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్‌రఫీ, ఎఎన్ఎం ఉష, రమాదేవి, ఆశాకార్యకర్త రెడ్డెమ్మ, అధ్యాపకులు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాప్ విజయవంతం

**ప్రజాశక్తి- రైల్వేకోడూరు**

అన్నమయ్య జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్ షాప్ కు మంచి స్పందన లభించిందని నిర్వాహకులు ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ కె.నాగార్జున తెలిపారు. వెలుగు ఎపిఎం పి.వసుంధర ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయం స్త్రీ శక్తి భవన్ లో ఎపిఎం ఎస్ఎంఇ వ్యాపార, సేవా పరిశ్రమల రంగాలలో వారికి అవసరమైన ఉద్యమ్ రిజిస్ట్రే షన్‌ను ఉచితంగా ఆన్‌లైన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు అవకాశాలు, మంచి వ్యాపార ప్రణాళికలతో అవగా హనతో ముద్ర, పిఎం ఇజిపి వంటి ప్రభుత్వ పథకాల ద్వారా బ్యాంకు రుణాలు పొంది వ్యాపా వేత్తలుగా ఎదగాలన్నారు. ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్ర మంలో ఇండస్ట్రియల్ ప్రమోషన్‌ఆఫీసర్ డి.శంకరప్ప, వెలుగు సిసిలు, యనిమేటర్లు పాల్గొన్నారు.

## పెరటి తోటల పెంపకం ఆరోగ్యకరం

**ప్రజాశక్తి-వీరబలి**

పెరటి తోటల పెంపకం ఆరోగ్యకరమని వెలుగు ఎపిఎం ఖాదర్‌వలి అన్నారు. ఈడిగపల్లి గ్రామంలో ఇంటింటికి వెళ్లి పెరటి తోటల పెంపకం వల్ల జరిగే ప్రయోజనాలను వివరించారు. మార్కెట్లలో కొనే కూరగాయలు, ఆకుకూరల్లో అధిక మోతాదులో క్రిమిసంహారక మందులు పిచికారీ చేయడం వల్ల వాటిని మనం ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. రోజువారీ ఆకు, కూరగాయలు ఇంటి పరిసరాల్లో పండిచడం వల్ల ఆరోగ్య సమస్యలు ఉండవన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలంటే పెరటి తోటలు ఉండాలన్నారు. రైతు సాధికారం సంస్థ, వెలుగు సిబ్బంది అందరూ పెరటి తోటలకు అవకాశం ఉన్న ఇళ్లలో ఉచితంగా విత్తనాలు విత్తడం జరిగిందని తెలిపారు. ఈడిగపల్లి గ్రామంలో 80 శాతం పెరటితోటలు పెంచడం సంతోషకరమన్నారు. కార్యక్రంలో వెలుగు సిసిలు గంగాధర్, నాగేంద్ర, ఐఎఫ్‌సి మండల యాంకర్ పర్సన్ అనిత, ఎపిసిఎన్ఎఫ్ మండల కో-ఆర్డినేటర్ ఆంజనేయులు, సిఆర్‌పిలు జ్యోతి, లక్ష్మి, అరుణ,జమీల పాల్గొన్నారు.

# క్రైం కార్నర్

## మహిళపై హత్యాయత్నం

### - రూ.5 లక్షల విలువైన బంగారు నగలు అపహరణ

**ప్రజాశక్తి-పుల్లంపేట**

మహిళపై హత్యాయత్నం చేసి రూ.5లక్షలు విలువైన బంగారు నగలు అపహరించిన ఘటన మండల పరిధిలోని వత్తలూరు గ్రామపంచాయతీ గుండాలతిప్పలో జరిగింది. బాధితురాలి బంధువుల వివరాల మేరకు.. వత్తలూరు వడ్డిపల్లికి చెందిన ఏరుకాలవ చిన్నయ్య భార్య రమాదేవి రాజంపేటలోని నలందస్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న తన కూతురు వద్ద నివసిస్తోంది. రమాదేవి పెనగలూరు మండలం ఇండ్లూరు గ్రామానికి చెందిన శీను, లక్ష్మిలకు కొంత నగదు అప్పుగా ఇచ్చిందన్నారు. ఈ అప్పును వసూలు చేసేందుకు వారం రోజుల క్రితం ఇండ్లూరుకు వెళ్లేందుకు బెస్తపల్లి వద్ద బస్సు కోసం ఎదురు చూస్తుండగా అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇప్పుడు ఆటోలు రావు నా బైక్‌లో ఎక్కు తీసుకెళ్తానని నమ్మబలికించి ఇండ్లూరులోని లక్ష్మి ఇంటికి తీసుకెళ్లాడని తెలిపారు. అక్కడ ఆమె లేకపోవడంతో రమాదేవి తిరిగి రాజంపేటకు వచ్చేందుకు సిద్ధమైందన్నారు. తాను కూడా రాజంపేటకు పోతున్నానని, మానాన్న పోలీసని, తాను ఫారెస్ట్ లో బీట్ ఆఫీసర్‌గా భయపడవద్దని చెప్పి రాజంపేటలోని తన కూతురి ఇంటి వద్ద దింపి పరిచయం చేసుకున్నాడని తెలిపారు. పొలం ఉంటే వారికి రూ.5లక్షలు లోను ఇప్పిస్తానని ఎవరైన ఉంటే చెప్పమని నమ్మకం కలిగించాడని చెప్పారు. మా పొలం ఉందని చెప్పడంతో నీకు లోను పెట్టిస్తానని ఫోన్ నెంబర్ తీసుకున్నాడని పేర్కొన్నారు. బుధవారం ఫోన్ చేసి పొలం చూపించమని అడిగారని, వత్తలూరు గ్రామంలోని మల్లెంవారిపల్లి వద్ద నున్న జడ్‌పి హైస్కూల్ వెనక వైపు గల గుండాలతిప్ప వద్ద గల తమ పొలం వద్దకు అతడిని తీసుకెళ్లినట్లు తెలిపారు. పొలం చూడాలని కొండ మీదికి వెళ్దామని కోరడంతో కొండమీదికి రమాదేవి వెళ్ళినట్లు తెలిపారు. పొలం చూసే సమయంలో కొండపై నుంచి కిందికి తోశాడని తెలిపారు. రాళ్లతో హత్యాయత్నం చేసేందుకు ప్రయత్నం చేశాడని తెలిపారు. తల పైన, చేతుల పైన, నడుము పైన, కాళ్ళ పైన తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. లేవని స్థితిలో ఉండటంతో ఆమె మెడలో ఉన్న మూడు తులాల సరుడు, ఒకటిన్నర తులం కమ్మలు లాక్కుని వెళ్ళాడని తెలిపారు. వీటి విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని తెలిపారు. బాధితురాలిని ఎఎస్‌పి కార్యాలయం వద్దకు వెళ్లి జరిగిన సంఘటనను వివరించారు. అనంతరం పుల్లంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయించినట్లు తెలిపారు. అనంతరం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో తలపై 14 కుట్లు వేశారని, మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలిచినట్లు చెప్పారు. అక్కడ తలకు తీవ్ర గాయాలయ్యాయని తిరుపతికి రెఫర్ చేయడంతో ప్రస్తుతం తిరుపతి లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

## యువకుడి ఆత్మహత్య

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

యువకుడి ఆత్మహత్య చేసుకోవడం మదనపల్లెలో గురువారం వెలుగు చూసింది. రెండో పోలీసుల కథనం మేరకు.. అయోధ్యనగర్‌లో బుధవారం రాత్రి గుర్తుతెలియని యువకుడు ఉరివేసుకొని మృతి చెందాడు. గురువారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా వారు వెళ్లి మృతదేహం పరిశీలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడు బి. కొత్తకోట మండలం, కనికిలతోపుకు చెందిన కొటాల వెంకటేష్(38)గా గుర్తించారు. అతను ద్విచక్ర వాహన మెకానిక్ గా పని చేసుకుని జీవనం చేసే వాడని తెలిసింది. వెంకటేష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని, దర్యాప్తు చేస్తున్నామని సిఐ రాజారెడ్డి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

పట్టణంలోని బైపాస్ రోడ్డులోని స్థానిక నగర పంచాయతీ కార్యాలయం సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది.వివరాల్లోకి వెళితే..ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో బి.కొత్తకోట పట్టణం,బలిజ వీధికి చెందిన మొహమ్మద్ తీవ్ర గాయాల పాలయ్యాడు. గమనించిన స్థానికులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తీసుకెళ్లాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సూచించారు. ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.